

## ప్రజా పాలన వేడుకలకు ఏర్పాటు : కలెక్టర్

**వరంగల్ నేడు బ్యూరో:** వరంగల్ జిల్లా కేంద్రంలో ఈనెల 17న నిర్వహించనున్న ప్రజా ప్రజా పాలన వేడుకలకు విస్తృతస్థాయిలో ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి అధికారుల ఆదేశించారు. వరంగల్ నగరంలోని ఆజాం జాహీ గ్రౌండ్లో నిర్మిస్తున్న కొత్త కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ఈ వేడుకలను పురస్కరించుకొని కలెక్టర్ కార్యాలయంలో జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ చాహత్ వాజ్పాయ్, డిసిపి అంకిత్ కుమార్, సంబంధిత శాఖ అధికారులతో ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షించారు.



## ప్రజా ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి: కలెక్టర్

**వరంగల్ ,నేడు బ్యూరో:** వరంగల్ కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు వినతి పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి స్వయంగా వినతి పత్రాలను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా శాఖల అధికారులకు అందజేశారు. నేటి ప్రజావాణి కార్యక్రమానికి 166 ఫిర్యాదులు రాగా అధికంగా రెవెన్యూ సమస్యలు72, జి డబ్ల్యూ ఎం సి 20, గృహ నిర్మాణ శాఖ 11, విద్యాశాఖ 9, డి ఆర్ డి ఓ 7, అలాగే ఇతర శాఖలకు సంబంధించిన 47 47 ఫిర్యాదులు వచ్చాయి.

## బతుకమ్మ ఉత్సవ ఏర్పాట్లను పూర్తి చేయాలి :కలెక్టర్



**వరంగల్ ,నేడు బ్యూరో:** బతుకమ్మ ఉత్సవ ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. సోమవారం హనుమకొండ కలెక్టరేట్లో వివిధ శాఖల అధికారులు వేద పండితులతో బతుకమ్మ ఉత్సవ ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈనెల 21న రాష్ట్రవ్యాప్తంగా బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభమవుతున్నాయని, అందులో భాగంగా హనుమకొండలోని చారిత్రక వేయి స్తంభాల దేవాలయంలో ఘనంగా బతుకమ్మ పండుగ ప్రారంభోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు.



## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

**మేడ్చల్, నేడు న్యూస్ :** రోడ్డు ప్రమాదంలో యువతి ఇస్లావత్ అనూష, మహేశ్వర్ రెడ్డిలు మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మేడ్చల్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని ఘనపూర్ గ్రామంలో గల మెడిసిటీ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మూడవ సంవత్సరం చదువుతున్న ఇస్లావత్ అనూష (20) తన మిత్రుడు మహేశ్వర్ రెడ్డితో ఏపీ28సిహెచ్9386 అనే నెంబర్ గల ద్విచక్ర వాహనంపై మేడ్చల్ నుంచి కొంపల్లి వైపు వెళ్తుండగా మార్గమధ్యమైన కండ్లకోయ సమీపంలోని ఆక్సిజన్ పార్కు బస్ స్టాప్ వద్ద అతివేగంగా వచ్చిన ఎంపీ28హెచ్3645 అనే నెంబర్ గల లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు కిందపడగా అనూషపై నుంచి లారీ వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదంలో గాయపడిన మహేశ్వర్ రెడ్డిని మేడ్చల్ పట్టణంలోని సంప్రద ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మహేశ్వర్ రెడ్డి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మేడ్చల్ పోలీసులు తెలిపారు.



## ట్రాన్స్ఫర్ స్టేషన్ను సందర్శించిన మేయర్, కార్పొరేటర్

**వరంగల్ ,నేడు బ్యూరో:** మధ్యప్రదేశ్ ఇండోర్లో నిర్వహిస్తున్న ట్రాన్స్ఫర్ స్టేషన్ ను ఐసీసీసి కేంద్రాలను వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్లు పరిశీలించారు. ట్రాన్స్పోర్టేషన్ స్టేషన్ సందర్శనలలో భాగంగా 6 రకాల చెత్తను సేకరించే విధానాలను వారు సందర్శించారు. ఐసీసీ సి సెంటర్లో అన్ని రకాల సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ వాహనాల జిపిఎస్ ట్రాకింగ్ సిస్టమును సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.



## ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

**కారేపల్లి. నేడు న్యూస్ :** కారేపల్లి మండలం మాణిక్యారం హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు కోవెల లక్ష్మినర్సింహా ఆచార్యులు జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా కలెక్టర్ చేతుల మీదిగా అవార్డు అందుకున్నారు. అయనను మంగళవారం హెచ్ఎం కే.కిషన్ ఆధ్వర్యంలో మాణిక్యారంలో స్కూల్లో ఘనంగా సన్మానించారు. కోవెల లక్ష్మినర్సింహచార్యులు తెలుగు భోధనలో చూపిన వినూత్న ఒరవడి, అంకిత భావం మిగతా ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచారని హెచ్ఎం కిషన్ అన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు డి. ఈర్యా గారు ,బి.నరసింహ గారు, పి.అప్పారావు గారు, ఎం.గురుమూర్తిగారు, కే.కృష్ణ రావు గారు, ఏ.నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

### వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధిపై

# సీఎంతో చర్చించిన ఎంపీ



**వరంగల్, నేడు బ్యూరో:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య హైదరాబాద్ లో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాజీపేట రైల్వే స్టేషన్ ఎదుట నూతన మల్టీ మోడల్ ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం నిర్మాణానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కోరారు. ఈ బస్టాండ్ నిర్మాణం ద్వారా ప్రయాణీకులకు విశేష ప్రయోజనం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. భూపాలపల్లిలో రైల్వే స్టేషన్ ఏర్పాటు, భూపాలపల్లిని హసన్పర్తి రోడ్ లేదా భూపాలపల్లి జిల్లాకు దగ్గరగా ఉన్న ఉప్పల్, కమలాపూర్ రైల్వే స్టేషన్లకు అనుసంధానించే కొత్త రైల్వే లైన్ నిర్మాణంతో ప్రజా ప్రయోజనంతో పాటు ప్రాంతీయ అభివృద్ధి జరుగుతుందన్నారు. ఇప్పటికే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని మరోసారి రాష్ట్ర ప్రభుత్వం తరపున కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావాలని సీఎం ని కోరారు. అలాగే నష్కల్ నుంచి హసన్పర్తి, చింతల్పల్లి నుంచి నష్కల్ వరకు రెండు కొత్త రైల్వే బైపాస్ లైన్లను ప్రతిపాదించారని, ప్రతిపాదిత అలైన్మెంట్లు వరంగల్ మాస్టర్ ప్లాన్ 2041కి విరుద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఈ ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వం గానీ కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ గానీ స్థానిక ప్రతినిధులను సంప్రదించకుండానే తయారు చేయబడ్డాయని ఎంపీ పేర్కొన్నారు. ప్రస్తుత ప్రతిపాదనలను పునఃపరిశీలించడం ద్వారా ఓ ఆర్ ఆర్ ను ఆనుకుని రైల్వే మౌలిక సదుపాయాలను ప్లాన్ చేయాలని, అప్పుడు రైతుల సమస్య తీరుతుందని, ట్రాఫిక్ సమస్య ఉండదని, వరంగల్ నగర ప్రణాళికతో పాటు అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ అంశంపై కూడా గతంలో కేంద్ర రైల్వే మంత్రిని కలసి వినతి పత్రం సమర్పించినట్లు వెల్లడించారు. రైల్వే అలైన్మెంట్ మార్పు విషయం వెంటనే కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎంపీ సీఎం కి విజ్ఞప్తి చేసారు. వరంగల్ పార్లమెంటరీ నియోజకవర్గంలోని ఎంతో గొప్ప చారిత్రాత్మక దేవాలయాలైన శ్రీ భద్రకాళి ఆలయం, వేయి స్తంభాల ఆలయం తో పాటు చిల్పూర్ శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయం యొక్క సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకం సహకరించాలని, కేంద్ర ప్రభుత్వంతో వీలైనంత త్వరగా ఆలయాల అభివృద్ధిపై చర్చించి, అవసరమైన నిధులను త్వరగా మంజూరు చేసే విధంగా చూడాలని కోరారు. వరంగల్ జిల్లా పరిధిలో ఉన్న చారిత్రాత్మకమైన దేవాలయాలను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని, అలాగే జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కోటగుల్లు (ఘణపూర్ దేవాలయాన్ని), నాపాక, రెడ్డి గుడి దేవాలయాల పునరుద్ధరణను వేగవంతం చేయాలని సీఎం ని కోరారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం తరపున కేంద్రానికి వినతిపత్రం అందజేస్తామని తెలియజేసారు.

## అక్రమ నిర్మాణాలను కూల్చిన అధికారులు

- ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసిన బాధితులు
- తమ ఇల్లు కూలిస్తే చస్తామంటూ.. పెట్రోల్ పోసుకున్న యువకుడు..
- అధికార పార్టీ నాయకులు రూ. 3 లక్షలు డిమాండ్ చేస్తున్నారని బాధితుల ఆరోపన
- పేదల ఇండ్లపై బుల్డోజర్ కూల్చివేతలంటూ విమర్శలు



**పీర్జాదిగూడ, నేడు న్యూస్:** నగర పరిధిలోని సర్వేనెంబర్ 199లోని అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. పీర్జాదిగూడ నగర పరిధిలోని 6వ డివిజన్ సర్వే నెం 199 వీకర్ సెక్షన్ కాలనీలో మంగళవారం కూల్చివేతలు చేపట్టారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది అక్రమ నిర్మాణం పేరిట చేపట్టిన పేదల ఇండ్ల కూల్చివేతలు ఉద్రిక్తతకు దారితీసింది. గత 25 ఏండ్ల గా ఇక్కడే నివాసం ఉంటున్నామని, మాకు ఈ చిన్నపాటి రేకుల ఇల్లే జీవనాధారం అంటూ పలువురు లబోదిబోమన్నారు. ఆటో నడిపించుకుంటూ, కూలి పని చేసుకుని కాలం వెళ్లదీస్తున్నాం. మా ఇంటిని కూల్చొదంటూ బాధితురాలు ఐశ్రత్ బేగం, మొహమ్మద్ గౌస్ ల కుమారుడు షానవాజ్ పెట్రోల్ పోసుకొని.. చస్తామంటూ.. హెచ్చరించారు. స్థానిక అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు పరమేశ్, కరీం మావద్ద రూ. 3లక్షలు డిమాండ్ చేశారని, మాకు అంత స్తోమత లేదని కాళ్ళు పట్టుకున్నా కనికరించలేదని బాధితులు ఆరోపించారు. డిమాండ్ చేసిన డబ్బులు ఇవ్వలేదన్న కారణంతో మాపై కుట్రపూరితంగా తప్పుడు సమాచారం ఇచ్చి మేడిపల్లి మండల రెవిన్యూ అధికారులను ఉసిగొల్పి నిల్వ నీడ లేకుండా చేయడం దుర్మార్గమని వాపోయారు. పేదవారిపైనే మీ ప్రతాపమా అంటూ తమకు న్యాయం చేయాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు.




# పోషణ మాసోత్సవాలు

- నేటి నుంచి నెల రోజుల పాటు కొనసాగింపు
- ఆహార పోషణ, ఆరోగ్యం పై అవగాహనే ప్రధాన ఉద్దేశం
- అంగన్వాడీ పిల్లలు, గర్భిణీలు, బాలింతల ఆరోగ్యం, పోషణ పై దృష్టి
- జిల్లాలో 793 అంగన్వాడీలు
- జిల్లాలో 1,27,401 మందికి లబ్ధి

**మేడ్చల్, నేడు బ్యూరో:** మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల సెప్టెంబర్ 17 నుంచి వచ్చే నెల అక్టోబర్ 16 వరకు నెల రోజుల వరకు 8వ జాతీయ పోషణ మాసోత్సవాలు జరుగనున్నాయి. ఇందుకు సంబంధించిన జిల్లా మహిళా సంక్షేమ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. సెప్టెంబర్ 17న బుధవారం పోషణ మాసోత్సవం పోస్టును ఆవిష్కరించడం ద్వారా జిల్లా కలెక్టర్ మను చౌదరి ఈ ఉత్సవాలను ప్రారంభించనున్నారు.

### పోషణ మాసోత్సవాల ప్రధాన ఉద్దేశం:

ప్రతి ఇంటికి వెళ్ళి గర్భిణులు, అంగన్వాడి పిల్లలు, మహిళలకు ఆహార పోషణ, ఆరోగ్యం మీద అవగాహన కల్పించాలన్నది ఈ మాసోత్సవాల ప్రధాన ఉద్దేశం. జిల్లాలో నెల రోజుల పాటు నిర్వహించనున్న ఈ పోషణ మాసోత్సవాలలో వివిధ అంశాల పై దృష్టి సారించనున్నారు. వాటి వివరాలు ఇలా : ఉబకాయం, పోషన్ బీ – పడ్డాయి బీ, ముర్రుపాల ప్రాముఖ్యత, పురుషులను భాగస్వాములు చేయడం, సామాజిక వేడుకలు నిర్వహించడం, లైన్ డిపార్ట్మెంట్స్ విద్య, వైద్య, డి.ఆర్.డి.ఏ తదితర శాఖల సహకారంతో పిల్లలు, గర్భిణులు, ఇతర మహిళలకు పౌష్టిక ఆహారం తీసుకునే విషయంలో అవగాహన కల్పించడం లాంటి చర్యలు చేపట్టనున్నారు. వివరంగా చెప్పాలంటే, ఊబకాయం వ్యాధి సోకకుండా ఉండటానికి చెక్కర, ఉప్పు, నూనెలు వాడకం తగ్గించడం పై అవగాహన కల్పిస్తారు. అలాగే, పోషకాహారం ఇవ్వడంతో పాటు అంగన్వాడి పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య, సంరక్షణ పై అవగాహన కల్పిస్తారు. వీరికి ప్రత్యేక కరికులం ద్వారా విద్యను అందిస్తారు. అదేవిధంగా, పిల్లలకు తల్లి పాలు పట్టడం, ముఖ్యంగా ముర్రుపాల ప్రాముఖ్యత పై అవగాహన కల్పించడం, పౌష్టిక ఆహారం పై అవగాహన కల్పించడం, ఇందుకు పురుషులతో పాటు అనుబంధ శాఖల సహకారం తీసుకోవడం లాంటి చర్యలు తీసుకోనున్నారు.

### మేడ్చల్ జిల్లాలో 793 అంగన్వాడి కేంద్రాలు

మేడ్చల్ జిల్లాలోని 15 మండలాల్లో కలిపి మొత్తం 793 అంగన్వాడి కేంద్రాలున్నాయి. వీటిలో, 1,27,401 మంది లబ్ధిదారులున్నారు. ఇందులో గర్భిణీలు 9,245 మంది, బాలింతలు 5,782 మంది, జీరో నుంచి ఆరు సంవత్సరాలలోపున్న పిల్లలు 1, 12, 364 మొత్తం కలిపి 1,27,401మంది లబ్ధిదారులు న్నారు.

### సద్వినియోగం చేసుకోండి



జిల్లాలో ఈ నెల 17 నుంచి పోషణ మాసోత్సవాలు జరుగ నున్నాయి. ఇవి నెల రోజుల పాటు జరుగుతాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ పిల్లలు, గర్భిణీలు, బాలిం తలకు అమలు చేస్తున్న వివిధ పథకాలు, సౌకర్యాలను ఈ సందర్భంగా అవగాహన కల్పించనున్నామనీ మేడ్చల్ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని శారద తెలిపారు. జిల్లాలోని అంగన్వాడి టీచర్స్ ఇందులో తప్పకుండా భాగస్వాములు కావాలని ఆదేశాలు ఇచ్చారు. గర్భిణీలు, బాలింతలు మసోత్సవాల్లో కల్పిస్తున్న అవగాహన కార్యక్రమాల్లో పాల్గొని, సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**- శారద, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని**



## అభివృద్ధి పనుల పర్యవేక్షణ

**బోడుప్పల్, నేడు న్యూస్:** బోడుప్పల్ నగర పరిధిలోని 21వ డివిజన్ పరిధిలో పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా 21వ డివిజన్లో జరుగుతున్న అభివృద్ధి పనులను మాజీ కార్పొరేటర్ భూక్య సుమన్ మంగళవారం పర్యవేక్షించారు. అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా రాజశేఖర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ భూక్య సుమన్ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెసులో గొడవలు

### ప్రజా పాలనలో అతిధుల మార్పు...!

**వరంగల్ ,నేడు బ్యూరో:** వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ లో ఇటీవల జరుగుతున్న గొడవల కారణంగా ఈనెల 17న నిర్వహించనున్న ప్రజాపాలన దినోత్సవానికి అతిథులను అధిష్ఠానం మార్చివేశారు. వరంగల్ కు మంత్రి కొండా సురేఖను ,హనుమకొండకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మార్చారు. గతంలో స్వాతంత్ర దినోత్సవం నకు వరంగల్ కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, హనుమకొండకు మంత్రి కొండ సురేఖలు అతిథులుగా హాజరై వేడుకలను జరిపేవారు. ప్రస్తుతం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో ఏర్పడిన వివాదం వల్ల మంత్రులను మార్పు చేసినట్టు తెలుస్తుంది.

## మహిళ మృతదేహం కలకలం

**రాజేంద్రనగర్ నేడు న్యూస్ :** రాజేంద్రనగర్ పరిధిలో మహిళ మృతదేహం లభ్యంకావడం స్థానికంగా తీవ్రంగా కలకలం రేపింది. ఈ సంఘటన రాజేంద్రనగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ కిస్మత్ పూర్ లో ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అత్యాచారం చేసి ఆపై హత్య చేసినట్లు అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహంపై బట్టలు లేకపోవడంతో రేపే అండ్ మర్డర్ గా అనుమానించారు. రంగం లోకి దిగిన క్లూస్ టీమ్ బృందాలు పలు ఆధారాలను పోలీసులు సేకరించారు. కిస్మత్ పూర్ బ్రిడ్జి కిందకి మహిళలను తీసుకొని వెళ్ళి అత్యాచారం చేసి ఆపై హత్య చేసినట్లు అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసునమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మహిళ వయస్సు సుమారు 20 నుంచి 30 వయస్సు ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు.



## నేడు ప్రజా పాలన దినోత్సవం

- కలెక్టరేట్ వద్ద భారీగా ఏర్పాట్లు
- జాతీయ పథకాన్ని ఆవిష్కరించనున్న ముఖ్య అతిథి

**మేడ్చల్, నేడు బ్యూరో:** సెప్టెంబర్ 17 ను ప్రజా పాలన దినోత్సవంగా జరుపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో మేడ్చల్ – మల్కాజ్ గిరి జిల్లా కలెక్టరేట్ లో సెప్టెంబర్ 17న ప్రజా పాలన దినోత్సవాన్ని నిర్వహించనుంది. అందులో భాగంగా కలెక్టరేట్ వద్ద ఉదయం 10 గంటలకు జాతీయ పథకాన్ని ఆవిష్కరించనున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. వేదిక ఏర్పాటుతో పాటు అధికారులు, సిబ్బంది కూర్చోటానికి వీలుగా ఆసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది విధిగా పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ఆదేశించారు. అయితే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎవరు హాజరవుతారన్న విషయాన్ని మాత్రం వెల్లడించక పోవడం గమనార్హం.

### అనుచరులతో కలిసి వెంకటేష్ యాదవ్ హంగామా

## సుమారు 50 మందితో కలిసి గొడవ

**రాజేంద్రనగర్ నేడు న్యూస్ :** నార్సింగి మున్సిపల్ పరిధిలోని గిరిగిరి గడ్డ ప్రాంతం సోమవా రం రణరంగాన్ని తలపించింది. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సుమారు 50 మంది అనుచరులతో కలిసి అక్కడికి చేరుకొని గొడవ చేశారు. దళితులమైన తమ ప్లాటును కబ్జా చేసేందుకు ఆయన అనుచరులతో కలిసివచ్చి రభస సృష్టించారని బాధితురాలు లచ్చమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. వైఎస్సార్ హయాంలో తనతో పాటు మరో వ్యక్తికి కలిసి 60 గజాల చొప్పున రెండు ప్లాట్లు కేటా యించి పత్రాలు ఇచ్చారని తెలిపింది. ఔటర్ సర్వీసు రోడ్డు పక్కనే ఉన్న సుమారు రూ.రెండున్నర కోట్లు విలువ చేసే 120 గజాల స్థలాన్ని కబ్జా చేసేందుకు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటేశ్ యాదవ్ యత్నిస్తున్నారని, ఈ క్రమంలోనే దొంగ పత్రాలు సృష్టించారని బాధితురాలు తెలిపింది. వెంకటేశ్ యాదవ్ మందీమార్బలంతో వచ్చి దాడికి యత్నించి తమను తోసి వేశారని తెలిపింది. బతకడానికి వచ్చిన మీరు ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని బెదిరించారని ఆరోపించింది. అసభ్యకరంగా దూషించినట్లు ప్లాట్ యజమాని లచ్చమ్మ తెలిపింది. భయానక వాతావరణం నెలకొనడంతో నార్సింగి పోలీసులు భారీగా ఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు. లేకపోతే తమ పరిస్థితి దారుణంగా ఉండేదని బాధితురాలు లచ్చమ్మతోపాటు ఆమె కుమారులు తెలిపారు. తమపై దౌర్జన్యా నికి పాల్పడిన వెంకటేశ్ యాదవ్తో పాటు ఆయన అనుచరులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితురాలు నార్సింగి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. అనంతరం ఆమె అక్కడే మీడియాతో మాట్లాడుతూ.. ప్లాటుకు సంబంధించిన ఒరిజినల్ పత్రాలు చూ పించారు. పోలీసులు తమకు రక్షణ కల్పించాలని కోరింది.



# ఆరోగ్యశ్రీ పథకం

## సవాళ్లు, పరిష్కారాలు

(సి. హెచ్. ప్రతాప్)

**తెలంగాణలోని చిన్న, మధ్య తరహా ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్యసేవలను నిలిపివేయనున్నట్లు ప్రకటించడం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కలిగించింది. ఈ వార్త పత్రికలు, టెలివిజన్ ఛానెళ్లలో ప్రధానాంశంగా మారి, ముఖ్యంగా పేద మరియు మధ్యతరగతి కుటుంబాలలో కలవరాన్ని రేకెత్తించింది. గత ఇరువై రోజులుగా ఆసుపత్రుల యాజమాన్యాలు, ఆరోగ్యశాఖ అధికారులు, మంత్రి మధ్య జరిగిన చర్చలు ఫలితం లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. ముఖ్యంగా పెండింగ్ బిల్లుల చెల్లింపుల్లో నెలకొన్న జాప్యం ఈ సమస్యకు కారణమైంది. ఆసుపత్రుల నిర్ణయం వల్ల పేద ప్రజలు అత్యవసర సమయంలో వైద్యం పొందడంలో తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది.**

ఆరోగ్యశ్రీ పథకం పేదలకు ప్రాణదాతగా నిలిచింది. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు కూడా నాణ్యమైన వైద్యం అందించాలనే సంకల్పంతో ఈ పథకం ప్రవేశపెట్టబడింది. ఇప్పటి వరకు లక్షలాది కుటుంబాలు ఈ పథకం వల్ల అప్పుల ఊబిలోనుండి బయటపడి ప్రాణాలను కాపాడుకున్నాయి. సక్రమంగా అమలు జరిగితే పేదలు కార్పొరేట్ ఆసుపత్రులలో కూడా భారంలేకుండా చికిత్స పొందగలరు. దీని ద్వారా సమాజంలో ఆరోగ్య ప్రమాణాలు మెరుగవుతాయి, పేదరికం తగ్గుతుంది, ఉత్పాదకత పెరుగుతుంది. ఆసుపత్రులకు సకాలంలో బిల్లులు చెల్లిస్తే, వారు మరింత మెరుగైన సేవలు అందించగలరు, ఆధునిక సాంకేతికతను ప్రవేశపెట్టగలరు.

అయితే ఈ వ్యవస్థలో లోపాలున్నాయి. బిల్లుల చెల్లింపులో ఆలస్యం, పర్యవేక్షణలో లోపాలు, పథకం పరిధిలో కొన్ని కీలక వ్యాధులు లేకపోవడం ప్రధాన సమస్యలు. ఈ సవాళ్లను అధిగమించడానికి ప్రభుత్వం, ఆసుపత్రుల యాజమాన్యాలు పరస్పర సహకారం అవసరం. ప్రభుత్వం పెండింగ్ బిల్లులను త్వరితగతిన చెల్లించాలి. భవిష్యత్తులో పారదర్శకమైన, వేగవంతమైన చెల్లింపు విధానాన్ని అమలు చేయాలి. ఆసుపత్రులు కూడా బిల్లుల సమర్పణలో నిబంధనలు పాటించి స్పష్టతను కల్పించాలి.పథకం ప్రయోజనం మరింత మందికి అందాలంటే, క్యాన్సర్, గుండెజబ్బులు వంటి క్లిష్టమైన వ్యాధులను కూడా పూర్తిస్థాయిలో కవరేజ్‌లోకి తేవాలి. అలాగే, అమలుపై నిరంతర పర్యవేక్షణ కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి బిల్లుల పరిశీలన, ఆమోదం త్వరగా పూర్తయ్యేలా చూడాలి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సరిపడా నిధులు, సిబ్బంది, పరికరాలు సమకూర్చాలి. ఈ చర్యల వల్ల గ్రామీణ ప్రజలకు కూడా నాణ్యమైన సేవలు అందుతాయి.

మొత్తం చూస్తే, ఆరోగ్యశ్రీ పథకం కేవలం ప్రభుత్వ పథకం కాదు, అది ప్రజల ఆరోగ్య హక్కు, వారి జీవన భద్రతకు సంబంధించిన అంశం. సవాళ్లను జయించి సమర్థవంతంగా అమలు చేస్తే, ఇది తెలంగాణ ప్రజలకు నిజమైన వరంగా నిలుస్తుంది. ప్రభుత్వం, వైద్యరంగం కలిసికట్టుగా కృషి చేస్తే మాత్రమే ఈ పథకం దాని లక్ష్యాలను 100 శాతం చేరుకోగలదు.



## పల్లెలలో పారిశుధ్య లోపం

- ఉసిరికాయలపల్లి సమస్యలపై సీపీఐ(ఎం) సర్వే
- జాతరకు ప్రత్యేక నిధులు కేటాయించాలి

**కారేపల్లి. నేడు న్యూస్ :** పల్లెలో పారిశుధ్యం లోపించిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ(ఎం) వైరా డివిజన్ సభ్యులు ఉసిరికాయలపల్లి మాజీ సర్పంచ్ బానోత్ బన్సీలాల్ అన్నారు. మంగళవారం ఉసిరికాయలపల్లి గ్రామపంచాయతీలో సీపీఐ(ఎం) సర్వే నిర్వహించింది. బురద మయంగా మారిన అంతర్గత రహదారులతో అవస్థలు పడుతున్నారని, సైడ్ డ్రైనేజీలు లేక రోడ్లపైనే నీళ్లు నిలిచి దోమలకు నిలయాలుగా మారాయన్నారు. దసరా వస్తున్న సందర్భంగా లక్షలాది మంది కోటమైసమ్మ జాతరకు వస్తారని, ఆ సందర్భంగా గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టటానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో బీచింగ్ పౌడర్, దోమల మందు పిచికారిచేయాలని, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని, జాతరకు ఆర్టీసీ బస్ సౌకర్యం కల్పించాలని, కోటమైసమ్మ ఆర్చీ నుండి సీతారాంపురం వరకు రోడ్డు ఇరువైపుల తుప్పలు, చెట్లు తొలగించాలని కోరుతూ కార్యదర్శి బీ.నిరంజన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సర్వేకు బీఆర్ఎస్ గ్రామశాఖ సంఘీభావం ప్రకటించి సర్వేలో పాల్గన్నారు. ఈకార్యక్రమంలో దాసరి మల్లయ్య, తేజావత్ చందర్, దాసరి సైదులు, పచ్చిపాల నరసయ్య, బానోత్ నాగేంద్రబాబు, టిఆర్ఎస్ నాయకులు జాల సాంబ, బోడ హిరాలాల్, పృథ్వీ, బాలు తదితరులు పాల్గొన్నారు.



## కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ

**రాజేంద్రనగర్ నేడు న్యూస్ :** ప్రతి ఒక్కరూ కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాన్ని ప్రజలు సద్వినియోగించుకోవాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్ మండల రెవెన్యూ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మీ, షాదీ మూబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేంద్రనగర్ శాసనసభ్యులు టి.ప్రకాష్ గౌడ్ చెక్కులను అర్హులకు అందజేశారు. ఈ సందర్భంగా 276 మందికి రూ.2 కోట్ల 76 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో తహసీల్దార్ రాములు, రాజేంద్రనగర్ కాంగ్రెస్ నాయకులు, వర్రీ లలిత్, పడమటి శ్రీధర్ రెడ్డి , లక్ష్మారెడ్డి, శేఖర్,పవన్, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలకు కేరాఫ్ కాటేదాన్..?

- అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్న కింది స్థాయి అధికారులు.?
- సెలవు రోజుల్లో పనులు చేస్తున్న అక్రమ నిర్మాణదారులు
- చర్యలు తీసుకోవవడంలో వైఫల్యం చెందుతున్న ఐలా అధికారులు



**రాజేంద్రనగర్ నేడు న్యూస్:** రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్ దేవ్ పల్లి డివిజన్ కాటేధాన్ ఇండస్ట్రీయల్ ఏరియాలో అక్రమ నిర్మాణా దారులు పేట్రేగిపోతున్నారు. అడ్డుకునేవారు సైతం లేకపోవడంతో రోజురోజుకు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. స్థానికంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా పట్టించుకోవడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇదేమని అడిగితే దాడులు, ప్రతిదాడులు, ప్రశ్నలు, భయాందోళనలు వంటి సమస్యలను సృష్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై స్థానిక ప్రజలు ఎన్ని ప్రయత్నాలు చేసినా వాటిని అడ్డుకోవడంలో వైఫల్యం చెందుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రధానంగా మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధి కాటేదాన్ ఇండస్ట్రీయల్ ఏరియాలో విచ్చల విడిగా అక్రమ భారీ భవనాలు, షెడ్లు వెలుస్తున్నాయి. ఈ నిర్మాణాలకు అంతా ఐలా కార్యాలయంలో పనిచేసే కొందరు కిందిస్థాయి సిబ్బంది అక్రమ నిర్మాణదారులకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాటేదాన్ ఏరియాలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదనే నిబంధనలు ఉన్నాయి. అయినా అవేమి పట్టించుకోకుండా కొందరు ఐలా సిబ్బంది అక్రమార్కులతో కుమ్మక్కై అందినకాడికి దండుకుంటూ వారికి కావలసిన సహాయ సహయకారాలను అందిస్తూ నిర్మాణాలు పూర్తయ్యే వరకు పూర్తి సహకారాన్ని అందిస్తున్నారని ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ఈ అక్రమ నిర్మాణాలపై ఉన్నతాధికారులను వివరణ కోరగా నోటీసులు జారీ చేశామని చెప్పి తప్పించుకుంటున్నారు. అయితే ఈ విషయంపై ప్రశ్నించేందుకు ప్రయత్నిస్తే అధికారులు మొహం చాటేస్తున్నారు. అదికారులు మౌనంగా ఉన్నంత వరకు ఇలాగే సమస్యలు ఎదురవుతాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై ఉక్కు పాదం మోపాలని ప్రజలు కోరుతున్నారు.





### కింది స్థాయి సిబ్బంది చేతివాటం

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలార్దేవ్ పల్లి డివిజన్ కాటేదాన్ ఇండస్ట్రియల్ ఏరియాలో అక్రమ నిర్మాణాలను కింది స్థాయి సిబ్బంది పూర్తిగా ప్రోత్సహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదేమని అడిగితే దాడులు సైతం చేయడానికి వెనకడుగు వేయడం లేదని ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ఇలాంటి ఎన్ని అక్రమ నిర్మాణాలు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. దీనికి తోడు అడ్డుకోవాల్సిన అధికారులు సైతం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు వివరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ చూపి ఆక్రమణలను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



## గిరిజన ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం

### ఈ నెల 19న చలో గిరిజన సంక్షేమ కమిషనరేట్ -టియస్‌యుటిఎఫ్

**కారేపల్లి నేడు న్యూస్:** గిరిజన సంక్షేమ శాఖలో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బానోత్ రాందాస్ విమర్శించారు. మంగళవారం కారేపల్లి లో జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలపై తాత్సర్యం చేస్తుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై మంత్రులకు, గిరిజన సంక్షేమ శాఖా కమీషనర్ కార్యాలయంలో విన్నవించినా ఎలాంటి స్పందన లేకపోవటం విచారకరమన్నారు. దీంతో పోరాటాలతోనే ఉపాధ్యాయుల సమస్యలకు పరిష్కారం అవుతాయని యూటీఎఫ్ బావిస్తుందన్నారు. దానిలో భాగంగా ఈనెల 19న గిరిజన సంక్షేమ శాఖ కమీషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అప్పటికి అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి ముందుకు రాకపోతే ఆందోళనలు మరింత ఉదఅతం చేస్తామని అందుకు అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల కమిటీ సభ్యులు బానోత్ సూర్య, ఫణికుమార్, నాగలక్ష్మి, నాగేశ్వరరావు, రామారావు, శివకోటి, రామకఅష్ణ, సోమయ్య చారి, నరేంద్ర, సుజాత, సావిత్రి పాల్గొన్నారు.




## ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

### ఎస్పీ సీతారామ్

**రాజేంద్రనగర్ నేడు న్యూస్ :** ప్రతి ఒక్కరూ మత్తు వ్యసనాలకు దూరంగా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎస్పీ సీతారామ్ తెలిపారు. సీబీఐటీ ఎన్ఎస్ఎస్ క్లబ్ ఆధ్వర్యంలో యాంటీ–నార్కోటిక్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీబీఐటీ ఎన్ఎస్–ఎస్ క్లబ్ సభ్యులు మత్తుపదార్థాల వాడకం ప్రమాదాలపై అవగాహన కలిగించి, ఉన్నత భవిష్యత్తు కోసం యాంటీ–నార్కోటిక్స్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సీబీఐటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సివి నరసింహులు మార్గదర్శకత్వంలో ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ బి.శ్రీధర్, ఎన్ఎస్ఎస్ బృందం సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంలో ఇంపాక్ట్ గ్రూప్ నుండి సతీష్, డీఎస్పీ సైదులు, కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్రీనివాస్, యాంటీ డ్రగ్ కమిటీ కోఆర్డినేటర్ రామ్‌చందర్ వంటి విశిష్ట అతిథులు హాజరై, తమ అనుభవాలను పంచుకొని విద్యార్థులను మత్తు వ్యసనాల పట్ల అప్రమత్తంగా ఉండి, ఐక్యంగా ఎదుర్కోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలోని ప్రత్యేక ఆకర్షణ “స్టికీ నోట్స్ క్యాంపెయిన్” విద్యార్థులు మత్తు వ్యతిరేక నినాదాలు, ప్రతిజ్ఞలు, స్ఫూర్తిదాయకమైన సందేశాలను రంగురంగుల స్టికీ నోట్స్‌పై రాసి, కలిపి “వాల్ ఆఫ్ అవేర్‌నెస్” రూపంలో ప్రదర్శించారు. ఈ గోడ విద్యార్థుల ఆలోచనలకు, చర్చలకు కేంద్రంగా మారి, చిన్నచిన్న సహకారాలు కలసి పెద్ద సందేశాన్ని ఎలా సృష్టిస్తాయో చూపించింది. ఈ సందర్భంగా ఈగిల్ టీమ్ ఆలోచన రేకెత్తించే వీడియో ప్రదర్శనలు చేసి, మత్తు పదార్థాల దుష్ప్రభావాలను విద్యార్థులకు వివరించారు. చర్చలు, ప్రశ్నోత్తరాలు, అవగాహన ప్రసంగాలు నిర్వహించారు. చివరగా విద్యార్థులు, అధ్యాపకులు, అతిథులు కలసి మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా సీబీఐటీ విద్య కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా, సామాజిక బాధ్యత కలిగిన పౌరులను తీర్చిదిద్దడంలో కూడా కీలకపాత్ర పోషిస్తుందని మరొకసారి రుజువు చేసింది. సరైన అవగాహన, ప్రేరణ లభిస్తే య–ువత మత్తు వ్యసనాల వ్యతిరేకంగా శక్తివంతమైన శక్తిగా మారనున్నట్లుతెలిపారు.

# అన్నదాత అరిగోస..!

- రైతులకు తప్పని యూరియా తిప్పలు
- గుంట భూమి లేనోడు జోరుగా పైరవీలు
- పదుల సంఖ్యలో దొడ్డి దారిన తరలిపోతున్న బస్తాలు
- తలలు పట్టుకుంటున్న వ్యవసాయ అధికారులు

**పాలకుర్తి, నేడు న్యూస్:**

**జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో యూరియా మాఫియా జోరుగా కొనసాగుతుంది. మీడియా ముసుగులో గుంట భూమి లేనోడు రిపోర్టర్లమంటూ ఇబ్బందులకు గురి చేసి పదుల సంఖ్యలో బస్తాలు తీసుకెళ్తున్నారని అధికారులు వాపోతున్నారు. యూరియా కోసం రైతులకు ఎదురు చూపులు తప్పడం లేదు. ప్రతి రోజూ యూరియా వచ్చిందా.. అంటూ మండల కేంద్రానికి వచ్చిపోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున రైతులకు యూరియా అవసరం చాలా ఉంటుంది. ఇలాంటి సమయంలో యూరియాను ప్రభుత్వం అందుబాటులో ఉంచడం లేదంటూ రైతులు మండి పడుతున్నారు. వ్యవసాయ పనులు వదిలేసి మీ చుట్టే తిరగాలా అంటూ మండిపడుతున్నారు. పాలకుర్తిలోని సహకార సంఘానికి యూరియా వస్తున్నా అది సరిపోవడంలేదని అధికారులు పేర్కొంటున్నారు.**

రైతులు పాలకుర్తి డిసిసి బ్యాంకు వద్దకు వచ్చి యూరియా ఎప్పుడొస్తుందంటూ అధికారులను నిలదీశారు. ఒక్కో రైతు ఒక ఎకరం నుంచి పది ఎకరాల వరకు సాగుచేస్తున్న పరిస్థితుల్లో రెండు బస్తాలు ఎలా సరిపోతాయని ప్రశ్నిస్తున్నారు. యూరియా కోసం రైతులు పడరాని పాట్లు పడుతుంటే ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదని రైతులు వాపోతున్నారు. గత పదేండ్లలో యూరియా కోసం ఇంతగా ఇబ్బందులు పడిన దాఖాలాలు లేవని, కాంగ్రెస్ ప్రభుత్వం



వచ్చాకే రైతులకు కష్టాలు మళ్లీ మొదలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు సొసైటీ సిబ్బందితో గొడవ పడుతుండటంతో స్థానిక ఎస్ఐ దూలం పవన్ కుమార్ ఆధ్వర్యంలో క్యూ లైన్ లో ఉన్నవారికి ఎలాంటి గొడవలు జరగకుండా టోకెన్లు ఇప్పిస్తున్నారు.

### యూరియా లేకుంటే దిగుబడి ఎలా..?

రైతులకు తగిన మొత్తంలో యూరియాను అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. మూడు నాలుగు రోజులగా యూరియా కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా యూరియా దొరకడం లేదు. పంటలకు యూరియా లేకపోతే దిగుబడి ఎలా వస్తుంది. కొత్త కంపెనీలకు చెందిన యూరియా బస్తాలు దుకాణాల్లో కనిపిస్తున్నాయి. బ్లాకులో ఒక్కో బస్తా రూ.500 వరకు విక్రయిస్తున్నారు. సొసైటీలు, గ్రోమోర్ కేం ద్రంలో స్టాకు లేదంటున్నారు. యూరియా దొ రక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఎప్పుడో ఎనకటకొచ్చిన యూరియా కరువు ఇప్పుడొచ్చింది. మన దగ్గర కాలం కాక కరువు తాండవిస్తున్నది.. కాలం ఐతే యూరియా దొరకక అగమవుదుం. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఏనాడూ యూరియా కొరత లేదు. కావలసినంత యూరియా దొరికేది.

